క్లుప్తంగా

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



బోనాలతో వస్తున్న తండావాసులు

టేకులపల్లి: కోయగూడెం పంచాయతీ బావోజీ తండా గ్రామంలో గురువారం ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను స్థానిక గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని ఆటపాటలతో వేడుకలు జరుపుకున్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: జూలై 4,5 తేదీల్లో ఇల్లెందులో జరగనున్న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర 8వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం తుమ్మల చెలక, బద్దుతండా గ్రామాల్లో కల్తి వెంకటేశ్వర్లు, దుబ్బాకుల ప్రసాద్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని నిరుద్యోగులు ఈ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. చింత కోటి, సువర్ణపాక కృష్ణ, ఈసం బాబు, భూక్యా మహేష్, శ్రావణ్ కుమార్, బావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాల్వంచరూరల్: మండల పరిధి ఇల్లెందులపాడుతండా, పాండురంగాపురం తండా గ్రామాల్లో గురువారం డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వైద్యులు రామ్ ప్రణయ్, వైష్ణవి, వాణి, షాలీమ్ 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జగదీష్, రమేష్, పిట్టల సంపత్‌కుమార్, హరిబాబు, జాఫర్, వజ్జ వాసు, నాగరాజు, నాగేంద్రబాబు, రమేష్, సంతోష్ స్థానికులు పాల్గొన్నారు.

కొత్తవేతనాలు అమలు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జూన్ నుంచి కొత్తవేతనాలు అమలు చేయాలని ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి పి.మాధవ నాయక్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి విదేశీ పర్యటన నుంచి వచ్చిన వెంటనే బొగ్గుగని కార్మికులకు 11వ వేతనాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేసి, జూన్ నుంచి వేతనాలు చెల్లించాలని ఆదేశాలను కోలిండియా చైర్మన్‌కు జారీ చేసిన క్రమంలో సింగరేణి మినహా అన్ని బొగ్గు పరిశ్రమలు చెల్లించటానికి సుముఖంగా ఉన్నాయని, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారన్నారు. ఈ వేతనాలు సింగరేణి యాజమాన్యం కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పంట డబ్బులు ఎప్పుడు వచ్చేనో?

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంట విక్రయించిన రైతులు డబ్బుల కోసం నిరీక్షించి నీరసించారు. వానదేవుడి కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్న రైతులు చేతిలో చిల్లిగవ్వ లేక పెట్టుబడి సాయం కోసం దళారుల వైపు చూస్తున్నారు. పోయిన యాసంగిలో వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, మిల్లర్ల చేతిలో నిలువు దోపిడీకి గురయ్యారు. విక్రయించిన పంటకు తరుగు పేరుతో కోత పెట్టి మోసం చేశారని రైతులు వాపోతున్నారు.

- ధాన్యం, మొక్కజొన్న చెల్లింపులో జాప్యం
- నేటికీ సగం మందికి జమకాని వైనం
- పెట్టుబడికి దళారులను ఆశ్రయిస్తున్న రైతులు



మొక్కజొన్నలు తడవకుండా పట్టాలు కప్పుకున్న రైతులు (ఫైల్)

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలో చల్లసముద్రం, కొమరారం కేంద్రంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను ప్రారంభించినప్పటికీ పలు కారణాలు చూపుతూ కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేశారు. రోజుల కొద్దీ కల్లాల్లో నిరీక్షించిన రైతులు ఓపిక నశించి దళారులకు తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు కొనుగోళ్లు ప్రారంభించిన అధికారులు ఈ ప్రక్రియను నిదానంగా చేపట్టడంతో పలుమార్లు కురిసిన వర్షాలకు పంట తడిసి ముద్దయింది. దీంతో పంటను ఆరబెట్టుకునేందుకు రైతులకు ఆర్థికంగా తడిసిమోపెడైంది.

తరుగు పేరుతో కోత..

చల్లసముద్రం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం 1,889 క్వింటాళ్లు, కొమరారం కొనుగోలు కేంద్రం ద్వారా 213 క్వింటాళ్లు.. మొత్తం 2,103.20 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. క్వింటాల్ ఒక్కింటికి రూ.2,040 చొప్పున రూ.4.2 కోట్లు చెల్లించాలి. కానీ ఇంకా నేటికీ సుమారు 200 క్వింటాళ్ల డబ్బులు ఇవ్వాల్సి ఉంది. అయితే కొనుగోళ్ల సమయంలో వర్షాలకు ధాన్యం కేంద్రం వద్దే తడిసి ముద్దయింది. ఈ క్రమంలో తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి కోతలు లేకుండా మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ విక్రయించిన సమయంలో రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా డబ్బులు చెల్లించే సమయంలో మాత్రం క్వింటా ఒక్కింటికి మూడు కిలోలు చొప్పున కోత విధించారు. దీంతో అన్నదాతలు ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థంకాక అధికారులకు శాపనార్థాలు పెడుతున్నారు. మరికొందరు ధైర్యం చేసి గ్రీవెన్స్‌లో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

మొక్కజొన్న రైతులకు తప్పని నిరీక్షణ...

మండలంలో విక్రయం మొదలు, డబ్బులు చేతికందడంలోనూ రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ప్రారంభంలో అనుమతులు పూర్తిస్థాయిలో రాలేదని కొనుగోలు ప్రారంభించకుండా చోద్యం చూసిన అధికారులు నేడు కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించి డబ్బులు చెల్లించడంలోనూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. చల్లసముద్రం కొనుగోలు కేంద్రం ద్వారా 8,377 క్వింటాళ్లు, కొమరారం కొనుగోలు కేంద్రం ద్వారా 14,953 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. వీటికి క్వింటాల్ ఒక్కింటికి రూ.1,962 చొప్పున మొత్తం రూ.4.57 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ నేటికీ రూ.2.28 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగిలిన సొమ్ము కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఈ చెల్లింపులపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడికి డబ్బులు లేక..

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనా భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఒకవైపు వర్షాల కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తూనే మరోవైపు పెట్టుబడి డబ్బుల కోసం అన్నదాతలకు వెతుకులాట తప్పడం లేదు. మరికొందరు డబ్బులు ఎప్పుడు తమ ఖాతాల్లో జమ అవుతాయోనని బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించిన రైతులలో చాలామందికి ఆ డబ్బులు అందితేనే పెట్టుబడికి ఆసరాగా ఉంటుంది. ఇప్పటికే దున్నుడు కూళ్లు, విత్తనాల కొనుగోలు, క్రిమిసంహారక మందుల కొనుగోలు చేసి వ్యాపారులకు తిరిగి డబ్బులు చెల్లించేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. అంతేకాకుండా పండించిన, ధాన్యం కల్లాలకు వద్దకు తరలించేందుకు ట్రాక్టర్ కిరాయి, హమాలీ చార్జీలు చెల్లించకపోవడంతో వారు ఎదురైనప్పుడెల్లా రైతులు అవమానభారంతో కుంగిపోతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ధాన్యం, మొక్కజొన్న డబ్బులను వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



ధాన్యం తూర్పారపడుతున్న అన్నదాతలు (ఫైల్)

తరుగు పేరుతో మోసం



నాకు 49.20 క్వింటాళ్ల ధాన్యం పండింది. క్వింటాకు రూ.2060 చొప్పున రూ.1,01,352 ఇవ్వాల్సి ఉంది. కానీ తరుగు పేరుతో రూ.5,067 కోత పెట్టారు. ఈ విషయంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన.

– ఆంగోత్ రాము, రైతు, ఆంజనేయపురం

డబ్బు జమ కాలేదు



రెండు నెలల క్రితం 136 క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రంలో అమ్మినం. క్వింటాల్ ఒక్కింటికి రూ.1,962 చొప్పున రూ.2.66 లక్షలు రావాల్సి ఉంది. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదు.

– నూనావత్ తిరుపతి, రైతు, సేవ్యాతండా

27న ఎమ్మార్పీఎస్ సన్నాహక సదస్సు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: జూలూరుపాడు: ఈ నెల 27న పాల్వంచలోని లారీ అసోసియేషన్ హాల్‌లో జిల్లా ఎమ్మార్పీఎస్ సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుదీర్ఘకాలంగా నడుస్తున్న ఉద్యమం కీలక దశకు చేరుకుందన్నారు. బీజేపీ నేతలు చొరవ తీసుకుని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. తొమ్మిదేళ్లుగా మాటలతో గడుపుతూ వస్తున్నారని విమర్శించారు. కొత్తపల్లి సోమయ్య, వంగూరి రామ్మూర్తి, గంగపురి శ్రీనివాస్, వెంపటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఎంపిక

జూలూరుపాడు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జూలూరుపాడు మండల కన్వీనర్‌గా కొత్తూరు గ్రామానికి చెందిన గార్లపాటి నరసింహారావు నియమితులయ్యారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. వెంగన్నపాలెంకు చెందిన దేవరకొండ రమేష్‌ను కోకన్వీనర్‌గా నియమిస్తూ సంఘం జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చెంగల గురునాథం, చెంగల నరసింహారావు, ఏపూరి నరసింహారావు, దిబ్బెందుల కిరణ్, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

పాల్వంచరూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. రేగులగూడెం గ్రామంలో గురువారం బీఎస్పీ జెండా, ఎజెండా కార్యక్రమంలో భాగంగా పార్టీశ్రేణులతో కలిసి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రచార కరత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రోజుల తరబడి తాగునీరు రాకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం నియోజకవర్గం ప్రజలకు మంచినీరు అందించడంలో విఫలమైందన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం అందని ద్రాక్షలాగే మిగిలిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. గంధం మల్లికార్జున్ రావు, సాయి, అలెం సునిల్, ఆకాష్ పాల్గొన్నారు.

రెగ్యులర్ డీఈ కొనసాగింపు

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: కొత్తగూడెం పీఆర్ సబ్‌డివిజన్‌కు అధికారులు రెగ్యులర్ డీఈనే కొనసాగించాలని నిర్ణయించారు. అదనపు బాధ్యతలతో పాలన నెట్టుకొస్తున్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంపై ఈ నెల 12న సాక్షిలో ప్రచురితమైన 'పీఆర్‌లో ఇన్‌చార్జ్ పాలనే'అనే కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కొత్తగూడెం పీఆర్ సబ్‌డివిజన్‌లో ఏఈగా పనిచేస్తున్న వి.సత్యనారాయణ నాలుగేళ్లుగా డీఈగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఈయన ఇటీవల సెలవుపై అమెరికా వెళ్లడంతో అశ్వారావుపేటలో పనిచేస్తున్న రెగ్యులర్ డీఈ వేణుగోపాల్‌కు అధికారులు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.

ఎల్లన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన ప్రజావంథా రాష్ట్ర నాయకుడు, అజ్ఞాత దళనేత చంద్ర కృష్ణమూర్తి అలియాస్ ఎల్లన్న 1996లో ఎన్‌కౌంటర్ మృతి చెందారు. ఎల్లన్న ఆశయ సాధన కోసం పునరంకితం కావాలంటూ ఆ పార్టీ శుక్రవారం ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సభ విజయవంతానికి జన సమీకరణ కోసం ఆ పార్టీ అనుబంధ ప్రజా సంఘాలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. గురువారం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గ్రూపు మీటింగ్‌లతో సభలు, సమావేశాలు, ర్యాలీలతో ప్రచారం చేసింది. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమ దళపతి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చంద్ర కృష్ణమూర్తి అలియాస్ ఎల్లన్న 27వ వర్ధంతిని ఈ నెల 23వ తేదీన న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు తెలిపారు. ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి

ఇల్లెందు: ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని నిత్యం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ పార్టీ సభ్యులు నిబద్ధతతో పని చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. గురువారం ఇల్లెందులో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాజకీయ శిక్షణ తరగతులలో 'పార్టీ నిర్మాణం – కర్తవ్యాలు'అనే అంశం మీద ఆయన మాట్లాడారు. 1964లో సీపీఎం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు దోపిడీదారులకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలను కలుపుకుని అనునిత్యం పోరాడుతోందన్నారు. పెట్టుబడిదారులకు, పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం నడుం బిగించిందని పేర్కొన్నారు.

జీఎంకు ప్రజాప్రతినిధుల సన్మానం



సన్మానిస్తున్న 21ఏరియా ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియా 21పిట్ పరిధిలోని విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు గురువారం జీఎం జాన్ ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో కొలువుదీరిన సమస్యలను జీఎంకు వివరించారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల సమస్యను పరిష్కరించేలా తమకు సహకరించాలని, సింగరేణి తాగునీటి సరఫరాను మరింకొంత సమయం కొనసాగేలా చూడాలని, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని మెరుగుపర్చేందుకు సంస్థ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జేకే ఓసీ ప్రభావిత ప్రాంతమైనందున ఓసీ ఏర్పాటు వల్ల ప్రజలకు ఎటుంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూనెం కవిత, ధనసరి స్రవంతి, ఎంపీటీసీ పూనెం సురేందర్, ఉపసర్పంచ్ తాండ్ర నాగరాజు, గ్రామ పెద్దలు మంచాల వెంకటేశ్వర్లు, వడ్ల శ్రీను, ధనసరి రాజు, హరికృష్ణ, అబ్దుల్ నబి, క్లింట్ రోచ్, రెంటాల సదానందం, గూల్ల మొగిలి, సింగారపు శ్రీనివాస్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరించారు..

ఇల్లెందురూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఇల్లెందులో నిర్వహించిన అమరవీరుల దినోత్సవంలో కేవలం బీఆర్ఎస్ నాయకులను మాత్రమే సన్మానించడం నాడు పోరాడిన ఉద్యమ శ్రేణులను అవమానించడమేనని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ ఆరోపించారు.

గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో కేసులు, పోలీసు నిర్బంధాలను ఎదుర్కొని రాష్ట్రం సిద్ధించే వరకు సబ్బండ వర్గాలు ఉద్యమంలో భాగస్వాములయ్యాయని గుర్తుచేశారు. తెలంగాణ ధూం ధాం పేరుతో నియోజకవర్గంలోని కళాకారులు సుమారు 40 మంది కళారూపాలతో నిర్వహించిన ఉద్యమాన్ని నేడు మరచిపోయారని వాపోయారు.

నాడు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, కులసంఘాలను, విద్యార్థి సంఘాలను మరచి బీఆర్ఎస్ నాయకులు మాత్రమే వేడుకలకు ఆహ్వానించడం సరైంది కాదన్నారు. సన్మానాలు, సత్కారాలు అసలైన ఉద్యమకారులు కోరుకోవడం లేదని, నాడు జేఏసీ పేరుతో ఎలా ఉద్యమం నిర్వహించామో అదే తరహాలో నేటి కార్యక్రమం కూడా నిర్వహిస్తే బావుండేదన్నారు.

ప్రజల సొమ్ము దుర్వినియోగం



ఇల్లెందు: తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా సొత్తును దుర్వినియోగం చేస్తోందని, ప్రజల సొమ్ముతో బీఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. గురువారం దశాబ్ది దగా పేరుతో టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆందోళన నిర్వహించి తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్, చీమల వెంకటేశ్వర్లు, లక్కినేని సురేందర్, భూక్యా దళ్‌సింగ్ నాయక్, వెంకట ప్రవీణ్‌నాయక్, డాక్టర్ జి.రవి, డాక్టర్ రామచందర్ నాయక్, బానోతు విజయలక్ష్మి, ఆరెం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేస్తోందని నిరసన వ్యక్తం చేస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు మాట్లాడారు. దశాబ్ది అంటే దేశంలో ఎక్కడైనా పది సంవత్సరాలు అయితేనే దశాబ్దకాలం అంటారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అయింది. ఈ ఏడాది ఉత్సవాలు చేయడమేమిటని ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ఎన్నికల ప్రచారం చేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీ, ఎల్‌డీఎం పినపాక కోఆర్డినేటర్ మోతుకూరి ధర్మారావు, గరిపేట ఎంపీటీసీ కసనబోయిన భద్రం, గడ్డ రాజశేఖర్, నాయకులు సురేష్, అల్లాడి నర్సింహారావు, రామగిరి, లక్ష్మణాచారి, ఏలూరి రాందాస్, హరిసింగ్, కృష్ణారావు, పెగడ భిక్షపతి, కొమరయ్య, దుర్గారావు, సంగు యాలాద్రి, జమ్ముల రాజశేఖర్, కాప శ్రీనివాస్, బట్టు మురళి, వర్ష నారాయణ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని శ్రీపాండురంగ భజనమందిరంలో సాయిబాబా దేవాలయ పునర్నిర్మాణం కోసం గురువారం శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 వార్డు కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి, ఆలయ ఈఓ పాల్గొన్నారు. సాయిబాబా దేవాలయంతో పాటు కుసుమహరనాథ్ దేవాలయాల పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూజారి రమణాచార్యులు, ఓంప్రకాష్ ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


మోదీ పాలనతో దేశంలో సుస్థిరత..



ఇల్లెందులో ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: ప్రధాని మోదీ పాలనలో దేశం సుస్థిరంగా ఉందని, మరోమారు ప్రధానిని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బలగానీ గోపీకృష్ణ అన్నారు. బీజేపీ పిలుపులో భాగంగా మహాజన్ అభియాన్ సంపర్క్ కార్యక్రమంలో గురువారం ఇంటింటికి బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజలను వివరించి చైతన్యం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని నెంబర్-2 బస్తీలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రాంచందర్ నాయక్, మురళీకృష్ణ, రజత్ కుమార్ కోరీ, సంజయ్, సంతోష్, శివ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి బీజేపీ అనే కార్యక్రమాన్ని గురువారం చేపట్టింది. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆధ్వర్యంలో జూలూరుపాడులో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ సుపరిపాలన, పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో సిరిపురపు ప్రసాద్, పుల్లారావు, నర్వనేని కృష్ణ, చిలుకూరి కిరణ్, అప్పయ్య, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

మొక్కలకు రక్షణ కరువు

జూలూరుపాడు మండల కేంద్రం నుంచి పాపకొల్లు, జడలచింత వరకు గల అవెన్యూ ప్లాంటేషన్ అస్తవ్యస్తంగా ఉంది. ప్రతి హరితహారంలో మొక్కలు నాటడం, చనిపోవడం మళ్లీ నాటడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి. మొక్కల రక్షణకు చర్యలు చేపట్టడంలో జూలూరుపాడు, కొత్తూరు గ్రామ పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. మొక్కలను పశువులు తినడం, విరగ్గొట్టడంతో ఎండిపోయిన మొదళ్లు కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మొక్కల రక్షణ, పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : తులిసిరామ్,
మండల పంచాయతీ అధికారి,
సెల్ నంబర్: 9948238354

అమరుల త్యాగాలు మరువలేనివి..



కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో..



చుంచుపల్లి: గౌతంపూర్ గ్రామ పంచాయతీలో..



జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. దశాబ్దాలపాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలు కొనసాగాయన్నారు. ఎందరో మహానుభావులు ఈ ఉద్యమాలలో అసువులుబాసారని వారి సేవలను, పోరాటాలను ప్రజానీకం ఎప్పటికీ మరువబోదని పేర్కొన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో.. నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



ఇల్లెందు: అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల తదితరులు



పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఉద్యమకారులకు సన్మానం



టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో..